సాక్షి
నంద్యాల
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్య కళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన నటరాజ కూచిపూడి కళానిలయం వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శనివారం హైదరాబాద్‌కు చెందిన కొవ్వూరి శ్రీనివాసులు రూ.1,01,116 విరాళం అందించారు.



మహానందిలో సందడి

మహానంది: మహానంది ఆలయ ప్రాంగణాలు వీకెండ్ సందర్భంగా శనివారం కళకళలాడాయి. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మద్దిలేటిస్వామిని దర్శించుకున్న కలెక్టర్



బేతంచెర్ల: మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామిని జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా, కళ్యాణ చక్రవర్తి ఆలయ మర్యాదలతో కలెక్టర్‌కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఆలయ మాజీ చైర్మన్ ఎల్ల నాగయ్య , అర్చకులు మనోహర్, నరసింహ పాల్గొన్నారు.

శ్రీశైల డ్యాంలోకి కొనసాగుతున్న నీటి మళ్లింపు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలోకి రెండు రోజులుగా డ్యాం దిగువభాగంలో ఉన్న నీటిని మళ్లిస్తున్నారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో మిగులు విద్యుత్‌ను ఉపయోగించుకుని పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు 6,887 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి వదిలారు. ఎడమగట్టు కేంద్రంలో 2.965 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 0.80 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో జలాశయంలోకి 230 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 10,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 118.6216 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 863.90 అడుగులకు చేరుకుంది.

సుబ్రహ్మణ్య స్వామికి షష్ఠి మహోత్సవం

శ్రీశైలంటెంపుల్: మార్గశిర శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామికి (కుమారస్వామి) విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ పూజాదికాలతో పాటు హోమం కూడా నిర్వహించారు. ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పం పఠించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.3.66 లక్షలు

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్కరోజే వివిధ సేవల ద్వారా రూ. 3,66,386 ఆదాయం వచ్చింది. మార్గశిర మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని స్వామి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు ఉదయం స్వామి, అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు గండ దీపాలు మోసి మొక్కులు చెల్లించినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు నామధారణతో పాటు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

క్షేత్రాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీ రింగ్ విభాగం అధికారులను దేవస్థానం ఈఓ ఎం. శ్రీనివాసరావు ఆదేశించారు. శ్రీశైల దేవస్థాన పరిపాలనా సంబంధ అంశాలపై శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవస్థాన పరిపాలన భవనంలో జరిగిన ఈ సమావేశంలో ముందుగా ఇంజనీరింగ్ విభాగాధిపతులతో వివిధ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. తర్వాత వైదిక కమిటీ సభ్యులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులతో సమావేశమయ్యారు. భక్తులరద్దీకనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనుల్లో నాణ్యమైన మెటీరియల్ వాడాలన్నారు. విధినిర్వహణలో ఉద్యోగులు అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. సమవేశంలో వైదిక కమిటీ సభ్యులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఈ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం. నరసింహారెడ్డి, అన్నివిభాగాల సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

బుడిబడి అడుగులు తడబడుతున్నాయ్!

- దారి తప్పుతున్న బాల్యం
- నేర ప్రవృత్తికి దారి తీస్తున్న వైనం
- పలు చోట్ల హింసాత్మక ఘటనలు
- ఆదోనిలో మద్యం తాగి పాఠశాలకు వచ్చిన విద్యార్థులు
- గతంలో ముచ్చుమర్రిలో బాలికపై హత్యాచారం
- వరుస సంఘటనలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆందోళన
- స్మార్ట్ ఫోన్ వాడకమే కారణమంటున్న మేధావులు



- ఐదు నెలల క్రితం నందికొట్కూరు నియోజకవర్గంలోని ముచ్చుమర్రి గ్రామంలో ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన మరి కొంత మంది బాలురు కలిసి అత్యాచారం చేశారు. అనంతరం ఆ బాలికను చంపేశారు. విషయం బయటపడుతుందనే ఆందోళనతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడం...వారు బాలిక శవాన్ని మాయం చేయడం రాష్ట్రంలో సంచలనం కలిగించింది.
- ఇటీవల కోవెలకుంట్లలో సెల్‌ఫోన్ కోసం ఓ బాలుడు తన తమ్ముని గొంతు గట్టిగా పట్టుకోవడంతో ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు.
- రెండు నెలల క్రితం ఓర్వకల్లు మండలంలో ఉపాధ్యాయులు మందలించారని ఓ ఇద్దరు బాలికలు బెదిరించడానికి ఒంటికి నిప్పంటించుకుని భయపెట్టే ప్రయత్నం చేశారు. ఇందులో ఒక బాలిక నిప్పంటుకుని గాయాలై మరణించింది.
- రెండు నెలల క్రితం ఆదోని వద్ద ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి తరగతి గదికి మద్యం తాగి తూగుతూ వచ్చాడు. విషయం తెలిసి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఆ బాలునితో పాటు మరికొందరు బాలురు సైతం ప్రతిరోజూ మద్యం తాగుతున్నట్లు ఉపాధ్యాయులు ఆరా తీశారు.
- పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 2వ తేదీన ముగ్గురు విద్యార్థులు తరగతి గదిలో అల్లరి చేస్తుండగా ఉపాధ్యాయుడు మందలించాడు. ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఉపాధ్యాయునిపై తీవ్రంగా దాడి చేసి కొట్టారు. ఆ దెబ్బలకు ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటనలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఒక ఉపాధ్యాయున్ని ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

.. ఇవి చదువుతుంటే వామ్మో.. వీరు పిల్లలేనా.. అనుమానం కలగక మానదు. కారణాలు ఏవైనా చిన్నారులు దారి తప్పి అటు తల్లిదండ్రులకు.. ఇటు ఉపాధ్యాయులకు చెడ్డపేరు తెస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఏది చెడో.. ఏది మంచో తెలుసుకోలేని వయస్సు.. ఓ వైపు మాయమవుతున్న మానవ విలువలు.. మరో వైపు చెడు స్నేహాలు, వ్యసనాలు.. దారి తప్పించేందుకు ఎన్నో అవకాశాలు. సినిమాలో.. స్మార్ట్ ఫోనో.. తల్లిదండ్రుల నిర్లక్ష్యమో.. ఉపాధ్యాయుల అలసత్వమో తెలియదు కాని చిన్నారుల్లో నేరప్రవృత్తి పెరుగుతోంది. చిన్నతనంలో చుట్టూ ఉన్న సమాజం, తోటి స్నేహితులు, తల్లిదండ్రుల పెంపకంను బట్టి పిల్లలు ఎదుగుతారు. సమాజం, తోటి స్నేహితులు మంచి వారైతే వారు కూడా మంచిగా పెరుగుతారు. దీనికితోడు వారు ఏమి చేసినా తల్లిదండ్రులు పట్టించుకోకపోయినా, వారు గమనించకపోయినా పిల్లల్లో నేరాలు చేయడంలో సిద్ధహస్తులుగా మారిపోతారు. సమాజంలో ఇలాంటి ఘటనలే ఇటీవల వరుసగా జరుగుతున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం పిల్లలు చెడిపోవడానికి అనేక అవకాశాలు అందుబాటులో ఉండటం కూడా ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఆధునిక కాలంలో విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఘటనలు ప్రతిరోజూ పత్రికల్లో మనకు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో విలువైన తమ జీవితాలను, భవిష్యత్‌ను వారు కోల్పోతున్నారు. ఇలాంటి పిల్లలను దారిలో పెట్టేందుకు అటు తల్లిదండ్రులు ఇంటి వద్ద ఉండకపోవడం, ఇటు తరగతిలో ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో నేరప్రవృత్తి గల విద్యార్థులు సమాజంలో పెరిగిపోతున్నారు. పుస్తకపఠనం, క్రీడలకు ప్రాధాన్యం లేకపోవడం, మంచిమాటలు చెప్పేవారు కరువవ్వడంతో ఇలాంటి పిల్లల సంఖ్య క్రమంగా పెరుగుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం



స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాక ప్రతి ఒక్కరి చేతిలోకి వచ్చేశాయి. పెద్దలతో పాటు పిల్లలూ వీటిని విరివిగా వాడుతున్నారు. అందులో వాడే ఇంటర్‌నెట్ చౌక కావడం వల్ల ప్రతి ఒక్కరూ దానికి అలవాటు పడ్డారు. సోషల్ మీడియాలో విస్తృతంగా వివిధ కార్యకలాపాలతో పాటు అశ్లీల చిత్రాలు, నేరాలకు సంబంధించిన సంఘటనలు విపరీతంగా కనిపిస్తున్నాయి. సాధారణంగా మొబైల్‌లో ఏది ఓపెన్ చేస్తే అలాంటి చిత్రాలే నిరంతరంగా కనిపిస్తూ ఉంటాయి. దీనివల్ల చూసే వారి మెదడు కలుషితం అవుతుంది. అలాగే పిల్లల మనసు కూడా చెడుదారి పడుతోంది.

మద్యం, గంజాయిలకు అలవాటు



ఒకప్పుడు కొందరు చిన్నారులు మాత్రమే మత్తుకు అలవాటు పడేవారు. అది కూడా వారు వైట్‌నర్‌ను పీలుస్తూ మత్తులో తేలేవారు. కానీ ఇప్పుడు పిల్లలకు కూడా మద్యం, గంజాయి అందుబాటులోకి రావడంతో వారు అందులో తూలుతున్నారు. ఊళ్లో కొందరు పెద్దలే పిల్లలచే మద్యం దుకాణానికి వెళ్లి మద్యం తెప్పించుకోవడం, వారిచేత బీడీలు, సిగరెట్లు తెప్పించుకోవడం చిన్నతనం నుంచి అలవాటు చేస్తున్నారు. అవి ఏమిటో, వాటిని తాగితే ఎలా ఉంటుందోనని ఉత్సుకతతో చిన్నతనంలోనే పలువురు చిన్నారులు వాటికి అలవాటుపడుతున్నారు. ఇలా అలవాటు పడిన వారిని మందలించేవారు కూడా లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా నేరాలకు పాల్పడుతున్నారు.

సినిమాల ప్రభావమూ ఎక్కువే...!



ఇటీవల సినిమాల ప్రభావమూ టీనేజర్లు, పిల్లలపై ఎక్కువగా ఉంటోంది. సినిమాలో హీరో పాత్రదారి నేరాలకు పాల్పడుతూ ఉన్నత స్థానానికి ఎదిగిన వైనాన్ని చూపిస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. ఇటీవల వచ్చిన కొన్ని సినిమాలు ఇదే వృత్తాంతంతో ఉన్నాయి. వీటిలో విపరీతమైన హింస, శృంగారం, పెద్దలను లెక్కచేయకపోవడం వంటి ఘటనలు పిల్లలను ప్రేరేపితం చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

విద్యార్థులకు ప్రత్యేక క్లాసులేవీ

ఒకప్పుడు చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడం, ఇంటికి వచ్చాక వారిని ట్యూషన్‌కు పంపించి వారు బాగా చదువులో రాణించేలా తీర్చిదిద్దడం చేసేవారు. కానీ ఇప్పుడు చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువు రాని వారిని వెనుకబడిన వారిగా గుర్తించి ప్రత్యేక గ్రేడ్‌లో కూర్చోబెడుతున్నారు. వారిని ఎవ్వరూ పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి వారంతా ఒక గ్రూపుగా మారి నేరాలకు పాల్పడుతున్నారు. వారిని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాల వైపు దృష్టి మళ్లిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి



సమాజంలో ఇటీవల కాలంలో పిల్లలు నేరప్రవృత్తికి పాల్పడుతున్నారంటే అందులో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. పిల్లల్లో ప్రవర్తన మారిందని తెలియగానే వారిని కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. లేదా సైకాలజిస్టుల వద్దకు తీసుకెళ్లి మార్పించాలి. పిల్లలకు మద్యం, సిగరెట్లు, బీడీలు లాంటివి అమ్మకూడదు. ఈ మేరకు ప్రభుత్వం కచ్చితమైన చట్టాలు రూపొందించాలి. చైనా, ఆస్ట్రేలియా మాదిరిగా చిన్నారులకు అశ్లీల సైట్స్ అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలి. - డాక్టర్ కె.నాగిరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి



పిల్లల్లో నేరప్రవృత్తి పెరగడానికి తల్లిదండ్రుల నిర్లక్ష్యమే కారణం. సెల్‌లో అశ్లీల, నేర సంబంధ దృశ్యాలు చూసి వారు కూడా అలాగే చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. చిన్న కుటుంబాలు ఎక్కువ కావడం వల్ల పిల్లలకు మంచి చెప్పేవారు లేరు. ఉపాధ్యాయులను పిల్లలు లెక్కచేయడం లేదు. వారిని ఏమైనా అంటే తల్లిదండ్రులే వచ్చి ఉపాధ్యాయులను మందలిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. ఆకతాయి పిల్లలను మార్చేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. -డి. ఈశ్వరయ్య, ఉపాధ్యాయుడు, వడ్డేమాను జెడ్పీహెచ్ స్కూల్

పిల్లల తల్లిదండ్రులను పిలిచి చెబుతున్నాం



విద్యార్థులకు మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావడం, అందులో రీల్స్, అశ్లీల చిత్రాలు, నేరప్రవృత్తిని పెంచే దృశ్యాలు, యూట్యూబ్‌లో ఏ నేరం ఎలా చేయాలో చెప్పే అంశాలను చూసి కొంత మంది ప్రభావితం అవుతున్నారు. ఇలాంటి విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి హెచ్చరిస్తున్నాం. అయినా విద్యార్థుల్లో మార్పు రాకపోతే వారిని టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తున్నాము. చాలా మంది విద్యార్థులు ఉపాధ్యాయులు చెబుతున్నా మారడం లేదు. - డాక్టర్ వి. కరుణానిధి మూర్తి, ఉపాధ్యాయుడు, పంచలింగాల జెడ్పీహెచ్ స్కూల్

డోన్‌లో కేంద్రీయ విద్యాలయం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటుకు బాటలు

డోన్: నంద్యాల జిల్లా పరిధిలోని డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. నాడు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా గతేడాది జూలై మాసంలోనే కంబాలపాడు రోడ్డులో శుద్ధజల ప్లాంట్ వద్ద కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనాలు నిర్మించేందుకు 13 ఎకరాల స్థలం మున్సిపాలిటీ కేటాయించింది. తాత్కాలికంగా కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహణ కోసం రూ.12 కోట్లతో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల కోసం నిర్మించిన నూతన భవనాలను సైతం గత ప్రభుత్వం ఎంపిక చేసి అవసరమైన అనుమతులు మంజూరు చేసింది. తాజాగా దేశ వ్యాప్తంగా 85 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుక్రవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్ ఇందుకు ఆమోద ముద్ర వేయడం చకచకా జరిగింది.

జిల్లాకే తలమానికం

సహజంగా కేంద్రీయ విద్యాలయాలన్నీ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తారు. అయితే, అప్పటి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు డోన్‌లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే డోన్‌కు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. 960 మంది విద్యార్థులు చదువుకునేందుకు వీలుండే ఈ విద్యాలయంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పిల్లలకు, మరో 25శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు కేటాయిస్తారని అధికారులు తెలిపారు. కేంద్రీయ విద్యాలయం మంజూరుతో నంద్యాల జిల్లాలో డోన్ ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనుంది.



ప్రభుత్వ ఐటీఐలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసే భవనం ఇదే

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని..తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి పిల్లలను బడికి పంపాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఖాదరబాద్ నర్సింగరావు స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడి అనుమానాస్పద మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు పునాదులు పాఠశాలల నుంచే ప్రారంభమవుతాయన్నారు. తాను చదువుకున్న స్కూల్‌లోనే పూర్వ విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. కాగా తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని బాబు సర్కారు ఇప్పటి వరకు ఇవ్వలేదని కొందరు తల్లిదండ్రులు సమావేశంలో పెదవి విరిచారు. అంతకు ముందు ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఫయాజ్ అహమ్మద్, వైస్ చైర్మన్ మనీషా, ఉర్దూ ఇన్‌స్పెక్టర్ అస్మోద్దీన్, ఎంఈఓ శివరామకృష్ణలతో పాటు పీఈటీలు శివకుమార్, ప్రసాదరెడ్డి, దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

తూతూమంత్రంగా ఆత్మీయ సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు తూతూమంత్రంగా జరిగాయి. 1400 పాఠశాలల్లో పేరెంట్స్-టీచర్స్ మీట్‌లు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అయితే, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాల ప్రాధాన్యతను పక్కన బెట్టారు. రాజకీయ ప్రసంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బోధనాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమీక్షలు చేసుకోవాల్సి ఉంది. అయితే, చాలా పాఠశాలల్లో ఈ తరహాలో సమావేశాలు జరగలేదని స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులే పేర్కొనడం గమనార్హం.

- బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజకుమారి సహపంక్తి భోజనం చేశారు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామంలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ప్యాపిలి మండలం జలదుర్గం, రాచర్ల గ్రామాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంఎంఎస్ టెస్ట్

- జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)టెస్ట్ జిల్లాలో ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాధికారులు పూర్తి చేశారు. జిల్లా నుంచి 4,710 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే వీరికి ఉదయం, సాయంత్రం గైడ్ టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున రూ.48 వేలను కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తుంది. విద్యార్థుల ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభు త్వం ప్రతి ఏటా ఎన్ఎంఎంఎస్ టెస్ట్ నిర్వహిస్తుంది.

జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఆత్మకూరులో 6, డోన్‌లో 5, నంద్యాలలో 9 ఉన్నాయి. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రాల వద్ద అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, హాల్‌టికెట్లు అందని వారు బీఎస్ఈ.ఏపీ.జీవో.ఐఎన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు డిజిటల్ వాచీలు, సెల్‌ఫోన్ వంటి ఎల్రక్టానిక్ వస్తువులను వెంట తీసుకెళ్లరాదన్నారు.

ఎక్సైజ్‌లో మామూళ్ల రచ్చ!

- రాయ'బేరం' చేస్తున్న ఓ సీఐ
- అడిగినంత ఇవ్వాలని అధికారుల పట్టు
- ఇచ్చేది లేదని అడ్డుపడిన ఇద్దరు నేతలు
- మద్యం వ్యాపారుల్లో చర్చనీయాంశంగా వ్యవహారం



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

కర్నూలు: మద్యం వ్యాపారులు, అధికారులతో నాలుగు గోడల మధ్య జరిగిన మామూళ్ల ఒప్పందం అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతల జోక్యంతో రచ్చకెక్కి జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైవేటు మద్యం పాలసీ కాసులు కురిపిస్తుందని ఆశపడిన వ్యాపారులకు 'మామూళ్ల' కోసం ఎక్సైజ్ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. అక్టోబర్ 16 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి తగిలినా చాలు పరపతి పెంచుకోవచ్చనే భావనతో కొత్తవారు సైతం టెండర్లలో పాల్గొని దుకాణాలు దక్కించుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణం ఏర్పాటును పరిశీలించి ఎక్సైజ్ అధికారులు శాశ్వత అనుమతులు (లైసెన్స్) మంజూరు చేశారు. ఇందుకు గాను రెన్యువల్ గుడ్‌విల్ కింద ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షలు మామూళ్లు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి పెంచడంతో విషయం కాస్త ప్రజాప్రతినిధుల దృష్టికెళ్లింది. దీంతో ఓ మహిళా ప్రజాప్రతినిధి భర్తతో పాటు రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి జోక్యం చేసుకోవడంతో మామూళ్ల వ్యవహారం రచ్చకెక్కింది. ఈ మామూళ్ల ఒప్పందంలో ఓ సీఐ కీలకంగా వ్యవహరిస్తున్నారని, సి.బెళగల్, నందికొట్కూరు, కర్నూలుకు చెందిన ఆరుగురు మద్యం వ్యాపారులతో ఆయన వారం రోజులుగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అడిగినంత ఇవ్వాల్సిందేనని ఎక్సైజ్ అధికారులు పట్టుబట్టగా విషయం మహిళా ప్రజాప్రతినిధి భర్త దృష్టికి వెళ్లింది (మద్యం వ్యాపారంలో ఆయన కూడా భాగస్వామే). అధికారం చేతిలో ఉండటం, అధికారులు కూడా చెప్పినట్లు నడుచుకుంటారని ఆశ పడిన తెలుగు తమ్ముళ్లకు మామూళ్ల వ్యవహారం మింగుడు పడక ఎక్సైజ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పినట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

20 శాతం మార్జిన్ ఇప్పించాలి

అమ్మకాలపై లాభంగా 20 శాతం మార్జిన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రస్తుతం కొన్ని బ్రాండ్లపై 14 శాతం, మరికొన్ని బ్రాండ్లపై కేవలం 10 శాతం మార్జిన్ దక్కుతుందని, 20 శాతం మార్జిన్ (లాభం) ఇప్పిస్తే అడిగినంత మామూళ్లు ఇస్తామంటూ మద్యం వ్యాపారులు ఎక్సైజ్ అధికారులకు తేల్చి చెప్పినట్లు చర్చ జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ గదులు

జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటి వద్ద మద్యం తాపించడానికి ప్రభుత్వం అనుమతించలేదు. ఇందుకోసం వ్యాపారులు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల పక్కనే పర్మిట్ రూం తరహాలో గదులు ఏర్పాటు చేసి తాపిస్తున్నారు. దీనిని చూసీచూడనట్లుగా ఉండేందుకు ఒక్కొక్క దుకాణానికి రూ.65 వేలు నెలవారీ మామూళ్లు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు మద్యం వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. ఓ సీఐ, గతంలో మద్యం సిండికేట్‌లో కీలకంగా వ్యవహరించిన ఒకరు మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారుల మధ్య రాజీ ఒప్పందం చేసేందుకు ప్రయత్నిస్తుండగా అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలు అడ్డుపడి పొరుగు జిల్లాల్లో ఎలా ఒప్పందం కుదిరితే అలా చేద్దాం.. అప్పటివరకు మామూళ్లు ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పినట్లు సమాచారం. జిల్లాలో వారం రోజులుగా అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు మద్యం వ్యాపారుల్లో మామూళ్ల వ్యవహారంపై చర్చోప చర్చలు సాగుతున్నాయి. సందట్లో సడేమియా అన్న చందంగా సివిల్ పోలీసులు కూడా మామూళ్ల విషయాన్ని తెరపైకి తెచ్చి స్టేషన్ల వారీగా పిలిపించి చర్చలు జరుపుతున్నట్లు వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగరంలో 18 బార్లు, 20 మద్యం దుకాణాలు ఉన్నాయి. అన్ని స్టేషన్ల అధికారులు కూడా మామూళ్ల కోసం ఒత్తిడి పెంచినట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్



పర్స్ అందజేస్తున్న కండక్టర్ అంకమ్మ, అధికారులు

ఆత్మకూరు: పోగొట్టుకున్న పర్స్‌ను ప్రయాణికురాలికి, తిరిగి అందించి తన నిజాయితీని చాటుకుంది ఆర్టీసీ కండక్టర్ సీహెచ్‌పీ అంకమ్మ. కరివేన గ్రామానికి వస్తున్న ఓ ప్రయాణికురాలు కర్నూలులో బస్సు ఎక్కింది. దిగే సమయంలో బస్సులో పర్సు మరిచిపోయింది. పర్స్‌ను గమనించిన కండక్టర్ అంకమ్మ ఎవరిదంటూ ఆరా తీసింది. బస్సులో ఉన్న ప్రయాణికులు తమది కాదని చెప్పడంతో ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చేరుకున్న తర్వాత పర్స్‌ను ఆర్టీసీ సీఐ బి.కె.నాయక్‌కు అందించింది. అంతలోనే బాధితురాలు తాను పర్స్ బస్సులో మర్చిపోయానని ఆర్టీసీ డిపోకు ఫోన్ చేసి వివరాలు చెప్పింది. దీంతో ఆమెను డిపోకు రప్పించి పర్స్‌ను అందజేశారు. కాగా పర్స్‌తోపాటు అందులో ఉన్న రూ.3,600 నగదు దక్కడంతో ప్రయాణికురాలు కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కండక్టర్‌ను డిపో అధికారులు అభినందించారు. కార్యక్రమంలో టీఐటీ ఎంఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: తమ పాఠశాల విద్యార్థిని కె.జాహ్నవి జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైందని స్థానిక గుడ్‌బేస్ పాఠశాల ప్రిన్సిపాల్ ఏబుల్ తెలిపారు. శనివారం విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత నెలలో నందికొట్కూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో తమ విద్యార్థిని జాహ్నవి ప్రతిభ చూపి ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

పశువుల కొట్టాలు కూల్చివేత



జేసీబీతో పశువులకొట్టం కూల్చేస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వెంకటక్రిష్టారెడ్డి, చంద్రమోహన్ రెడ్డిల పశువుల కొట్టాలను శనివారం అధికారులు కూల్చేశారు. బాధితులు మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి తాము పశువుల కొట్టాలు వేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. తమ సొంత స్థలంలో వేసుకున్న కొట్టాలను కూటమి ప్రభుత్వం సీసీ రోడ్ల పేరుతో కూల్చివేసిందన్నారు. గత సోమవారం నంద్యాలలో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. విచారించి ఉత్తర్వులు ఇచ్చే వరకు సీసీ రోడ్డు వేయవద్దని కలెక్టర్ సూచించినా స్థానిక టీడీపీ నాయకుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి రోడ్డు పనులు ప్రారంభించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను నిలివేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

అక్రమాలకు నిలయం..మహిళా మార్ట్

- రూ.15 లక్షల వరకు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు
- బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్న నిర్వాహకులు
- రూ.6 లక్షల విలువ చేసే సరుకులు పాడైపోయినట్లు వింత లెక్కలు

అక్రమాలకు కోడుమూరు చేయూత మహిళా మార్ట్ నిలయంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల సంక్షేమమే లక్ష్యంగా మహిళా మార్ట్ ఏర్పాటైంది. 2023–24 వరకు మార్ట్ లాభాల్లో నడిచింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అడిగే వారు ఉండరనే ధీమాతో అక్రమాలకు తెరలేపారు. రూపాయి కాదు రెండు రూపాయలు కాదు.. ఏకంగా రూ.15 లక్షలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతూనే రూ.6 లక్షల విలువ చేసే సరుకు పాడైపోయినట్లు వింత లెక్కలు చూపుతున్నారు.

– కర్నూలు(అగ్రికల్చర్)



కోడుమూరులోని చేయూత మహిళ మార్ట్

కోడుమూరులో ఏర్పాటు చేసిన మార్ట్ విజయవంతంగా కొనసాగుతుండటంతో.. దాదాపు అన్ని మండలాల్లో మార్ట్‌లు ఏర్పాటు చేసి మహిళ ఆదాయాన్ని పెంచాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో కొత్త మార్ట్‌ల ఏర్పాటు ప్రక్రియ ఆగిపోయింది. పైలెట్ ప్రాజెక్టు కింద కోడుమూరులో ఏర్పాటు చేసిన మార్ట్‌లో కూడా భారీగా అక్రమాలు జరగడం, వాటిని కప్పిపుచ్చేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తుండటాన్ని పరిశీలిస్తే రానున్న రోజుల్లో మార్ట్‌లు ఏర్పాటు లేనట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్రమాలకు బాధ్యులైన వారు సరుకులు పాడైపోయినట్లు లెక్కలు చూపి బయటపడేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి అధికారులు కూడా వంతపాడుతున్నట్లు సమాచారం.

రూ.200 పెట్టుబడితో మొదలై..

కోడుమూరులో పైలెట్ ప్రాజెక్టు కింద స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు ఒక్కొక్కరు రూ.200 పెట్టుబడి పెట్టి మార్ట్ ఏర్పాటు చేసుకున్నారు. మార్ట్ ఏర్పాటులో అప్పటి సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం కోడుమూరు మండలంలో 1,300 స్వయంసహాయక సంఘాలు ఉన్నాయి. ప్రతి సంఘంలో 10 మంది సభుల చొప్పున 13,000 మంది మహిళలు ఉన్నారు. ఒక్కో మహిళ రూ.200 ప్రకారం పెట్టుబడి పెట్టడంతో దాదాపు రూ.26 లక్షల నగదు అందుబాటులోకి వచ్చింది. ఐటీసీ, పీఎన్‌జీ, హెచ్‌యూఎల్, బెస్ట్‌ప్రైజ్, కోల్గెట్ తదితర కంపెనీలతో టై అప్ అయ్యాయి. మహిళా మార్ట్‌ల్లో అన్ని నిత్యావసర వస్తువులే ఉంటాయి. ప్రముఖ కంపెనీలతో అనుసంధానం కావడం వల్ల నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు సరఫరా అవుతున్నాయి. స్వయంసహాయక సంఘాల్లోని సభ్యులందరు తమ కుటుంబాలకు అవసరమైన సరుకులన్నీ మార్ట్‌ల్లోనే తీసుకుంటారు. ప్రయోగాత్మకంగా నెలకొల్పిన మార్ట్ పొదుపు మహిళలనే కాదు.. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. మొదట్లో రోజుకు రూ.లక్ష టర్నోవర్ ఉందంటే మార్ట్‌పై వినియోగదారులకు ఆసక్తి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

నిధులు దుర్వినియోగం

మొన్నటి వరకు అభివృద్ధి బాటలో సాగుతున్న కోడుమూరు మార్ట్.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రమంగా దివాళా తీసింది. ఈక్రమంలో రూ.15 లక్షల వరకు దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. దుర్వినియోగం అయిన మొత్తాన్ని తగ్గించి చూపేందుకు శతవిధాలా ప్రయత్నాలు సాగుతున్నాయి. అక్రమాలకు రెండు, మూడు నెలల క్రితం వరకు పనిచేసిన ఏపీఎం కీలక సూత్రధారిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోడుమూరు మండలానికి మరొకరిని ఏపీఎంగా నియమించారు. ఏపీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటికి మార్ట్ బాధ్యతలు తీసుకోలేదు. మార్ట్‌ను సమగ్రంగా ఆడిట్ చేసిన తర్వాతే మార్ట్ నిర్వహణ బాధ్యతలు తీసుకుంటానని ప్రస్తుత ఏపీఎం కరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది. కాగా మార్ట్‌లో అక్రమాలు జరిగినట్లు బయటికి పొక్కడంతో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల ఆడిట్‌కు ఆదేశించారు. ప్రాథమిక సమాచారం మేరకు చేయూత మహిళా మార్ట్‌లో రూ.15 లక్షల వరకు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. ఎవరికి వారు మార్ట్‌పై పెత్తనం చెలాయించడం, ఇష్టారాజ్యంగా వ్యహరించడంతోనే మార్ట్‌లోకి అక్రమాలు చేరిపోయాయి.

ఏపీఎంకు మెమో జారీ...

నిధులు దుర్వినియోగం అయిన విషయం వాస్తవమేనని అధికారులు చెబుతున్నా.. వివరాలు మాత్రం వెల్లడించడం లేదు. మహిళా మార్ట్‌లో జరిగిన నిధుల దుర్వినియోగానికి బాధ్యురాలిని చేస్తూ ఇంతవరకు మార్ట్ బాధ్యతలను పర్యవేక్షించిన ఏపీఎంకు డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల మెమో జారీ చేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం మెమో హెచ్‌ఆర్ ద్వారా ఇవ్వాల్సి ఉంది. కానీ హెచ్‌ఆర్‌కు సంబంధం లేకుండా మెమో ఇచ్చినట్లు డీఆర్‌డీఏలో చర్చ జరుగుతోంది.

సరుకు పాడై పోయిందట..

అక్రమాల నుంచి బయటపడేందుకు కొత్త పల్లవి అందుకున్నట్లు తెలుస్తోంది. రూ.6 లక్షల విలువ సరుకులు పాడైనట్లుగా లెక్కలు చూపి.. ఈ మొత్తాన్ని దుర్వినియోగమైన మొత్తానికి రికవరీ చూపుతున్నట్లు తెలుసుకున్న పొదుపు మహిళలు, డీఆర్‌డీఏ సిబ్బందే ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది. అక్రమార్కులను కాపాడేందుకే సరుకులు పాడైనట్లుగా కొత్త పల్లవిని తెరపైకి తెచ్చారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

పూర్తి వివరాలు తెలుస్తాయి

కోడుమూరు మహిళా మార్ట్‌లో కొంతమేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోంది. ప్రస్తుతం మార్ట్‌లో ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయి. మార్ట్‌లో రూ.6 లక్షల విలువ చేసే సరుకులు పాడైనట్లు స్పష్టమవుతోంది. ఇంత భారీ మొత్తంలో సరుకులు పాడై పోవడాన్ని లోతుగా పరిశీలిస్తున్నాం. మార్ట్ వ్యవహారాలు చూసే సిబ్బంది టూర్‌కు వెళ్లారు. అందువల్ల ఆడిట్ తాత్కాలికంగా నిలిచింది. వారం రోజుల తర్వాత ఆడిట్ మొదలవుతుంది. పకడ్బందీగా ఆడిట్ చేస్తున్నాం. ప్రతి బిల్లును ఒకటికి, రెండు సార్లు చెక్ చేస్తున్నాం.

– నాగశివలీల, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

పెట్టుబడి సాయం అందించడంలో ప్రభుత్వ వైఫల్యం

- ఏపీ రైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య

ఎమ్మిగనూరుటౌన్: రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య విమర్శించారు. శనివారం స్థానిక మగ్బుల్ ఫంక్షన్ హాల్‌లో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు ప్రభుత్వం వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి ధరలు పూర్తిగా పతనమయ్యాయన్నారు. ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.25 వేల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, పట్టణ సీపీఐ, ఏపీ రైతు సంఘ నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, చిన్నన్న పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐజీ ఆకె రవికృష్ణ, ఎస్పీ బిందు మాధవ్

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

దేవనకొండ: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి అవసరమని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారి నడవడికలను గమనిస్తూ ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తల్లిదండ్రులు వలసలు వెళ్లాల్సి వస్తే వారి పిల్లల కోసం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో ఉన్న పోస్టర్లను ఆవిష్కరించారు. డ్రగ్స్ మత్తులో యువత చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉపాధ్యాయుల చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ పరీక్షల్లో అధిక మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని బాగా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. గ్రామంలో లైబ్రరీ ఉండడంతో ఎంతో అదృష్టమని, గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదివి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, తానా సంస్థ పొట్లూరి రవి, వాల్మీకి సంఘం స్టేట్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, దేవనకొండ సీఐ వంశీనాథ్, ఎంపీటీసీ రూపమ్మ, ఆవోపా నాగేశ్వరరావు, సర్పంచ్ చెన్నమనాయుడు, హెచ్‌ఎం ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పోటీలు

కర్నూలు(సెంట్రల్): గీత జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6–7 తరగతులు ఒక విభాగం, 8–9 తరగతులను మరో విభాగంగా విభజించి 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగ నుంచి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంపూర్ణ భవద్గీత శ్లోకాలు కంఠస్థం చేసిన వారికి 18 ఏళ్లలోపు ఉన్న వారిని ఒక విభాగం, 18 ఏళ్ల కంటే ఎక్కువగా ఉన్న వారిని మరో విభాగంగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా నంద్యాలలోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీకృష్ణమందిరంలో ఈనెల 9న పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9059802265ను సంప్రదించాలన్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

సి.బెళగల్: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం రెండు విద్యుత్ స్తంభాలు కూలి రోడ్డుపై పడ్డాయి. బస్టాండ్ ఆవరణంలోని మినీ వాటర్ ట్యాంక్ వద్ద విద్యుత్ స్తంభంపైకి కోతులు ఎక్కి ఎగరడంతో అక్కడున్న స్తంభంతోపాటు ఇరవై మీటర్ల దూరంలో ఉన్న మరో స్తంభం కూలిపోయాయి. స్థానికులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించి, ఇరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



సి.బెళగల్ బస్టాండ్‌లో కూలిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

నిందితుడిని శిక్షించాలి



సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ శ్రేణులతో కలిసి వారు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మాచాని వెంకటేష్, లక్ష్మన్న, యుకె రాజశేఖర్, కామర్తి నాగేషప్ప, ఖాశింబేగ్, శివప్రసాద్, సోమేష్, నీలకంఠ, మాధవ స్వామి, సయ్యద్‌చాంద్, వీరేష్, వినయ్‌కుమార్‌రెడ్డి, మాబ్బాషా, అల్తాఫ్, మల్లికార్జున, ప్రకాష్‌రెడ్డి, వీరారెడ్డి, చంద్రశేఖర్, నబి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమారుడిపై వేటకొడవళ్లతో దాడి



గాయపడిన హేమలత మాధవ్

ఆళ్లగడ్డ: ఆస్తి తగాదాల విషయంలో సొంత తమ్ముడి కుటుంబంపై అన్న కుటుంబ సభ్యులు వేట కొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తమ్ముడు తప్పించుకోగా అతని భార్య, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నల్లగట్ల గ్రామంలో శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లగట్ల గ్రామానికి చెందిన అనుముల రమణ, నాగరాజులు అన్నదమ్ములు. వీరి మధ్య కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈక్రమంలో శనివారం రాత్రి రమణ కుటుంబ సభ్యులతోపాటు మరి కొంతమందిని వెంటబెట్టుకుని వేట కొడవళ్లతో తమ్ముడు నాగరాజు ఇంటి మీదకు వెళ్లారు. ఆ సమయంలో నాగరాజు ఇంట్లో లేకపోవడంతో అతడి భార్య హేమలతపై దాడి చేశారు. అక్కడే ఉన్న ఆమె కొడుకు మాధవ్ అడ్డుకోబోగా అతనిపైనా దాడి చేశారు. వేటకొడవళ్ల దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లీ కుమారుడిని గ్రామస్తులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

23 మంది ఎంపీహెచ్‌ఏలకు ఉద్వాసన

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు పీహెచ్‌సీలలో పనిచేస్తున్న 23 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్)లను డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ ఉద్యోగం నుంచి తొలగించారు. తెలంగాణా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వారిని ఉద్వాసన పలికారు. ఇందులో పి. నారాయణస్వామి (అహోబిలం), కె.శ్రీధర (కోసిగి), జి.నాగరాజు (హొళగుంద), జి.సురేష్‌కుమార్ (పెద్దహరివాణం), డీపీ.కరుణాకర్(గోకవరం), ఎం.రంగన్న(గజ్జహళ్లి), ఆర్.బి.ప్రభాకర్(పలుకూరు), డి.సుబోసుబాబు (గోకవరం), బి.చంద్రశేఖర్ (చాగలమర్రి), టి.రామకృష్ణుడు (బండి ఆత్మకూరు), ఎండి.అహ్మద్ హుసేన్(పలుకూరు), ఎస్.సారనాథ్ (రుద్రవరం), కేఎండి.ఫారుక్ (కోసిగి), ఐ.కిరణ్‌కుమార్ (రుద్రవరం), బి.జయరాముడు (నందవరం), జి.వి. శ్రీనివాసరెడ్డి (కొత్తబురుజు), ఎస్.వెంకటేశ్వర్లు (శిరువెళ్ల), డబ్ల్యూ. సురేష్‌కుమార్ (గడివేముల), పి.తిరుమలేష్ (అహోబిలం), ఎ.నరసింహుడు (కొలిమిగుండ్ల), ఎ.బాలచంద్రుడు (వెలుగోడు), కె.బాలనరసింహుడు (పేరుసోముల), పీసీవీ. మహానంది (చాపిరేవుల)ఉన్నారు. వీరిని తక్షణం విధుల్లో నుంచి తొలగించాలని ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థికి పాముకాటు



పాముకాటుకు గురైన విద్యార్థి విష్ణువర్ధన్

కోసిగి: ఓ విద్యార్థిని శనివారం పాము కాటేసింది. మండల కేంద్రంలోని 9వ వార్డులో నివాసం ఉంటున్న శ్రీనివాసుల ఆచారి కుమారుడు విష్ణువర్ధన్ ఏపీ మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా డు. పేరెంట్స్ మీటింగ్ ఉండడంతో విద్యార్థి ఇంటి వద్ద షూను కవర్‌లో పెట్టుకుని హడావుడిగా పాఠశాలకు వెళ్లి అక్కడ షూ వేసుకున్నాడు. అప్పటికే షూలో ఉన్న చిన్నపాటి పాము విద్యార్థి కాలికి కాటు వేసింది. వెంటనే షూ తీసి చూడగా చిన్న పాము కనిపించింది. వెంటనే ఉపాధ్యాయులు గమనించి దానిని చంపి విద్యార్థిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం విద్యార్థి కోలుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పొలంలో యువకుడికి..

మిడుతూరు: మండలకేంద్రంలోని దూదేకుల కాలనీకి చెందిన ఖలీల్ పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: కుప్పగల్–కోసిగి ఆర్‌ఎస్ మధ్యలో గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. శనివారం కిలో మీటరు నంబరు 521/17–19 పరిధిలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. తీవ్రమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిప్పంటుకుని మహిళకు గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుని సున్నిపెంటకు చెందిన దర్శనం తేజశ్రీ(21) తీవ్రంగా గాయపడింది. శనివారం మధ్యాహ్నం పొయ్యిపై నీళ్ల కాచుకుంటుండగా చీరకు నిప్పంటుకుంది. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పి సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తేజశ్రీది ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం చాట్లమడ గ్రామం. 2019లో సున్నిపెంటకు చెందిన సురేష్‌తో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది.